క్లుప్తంగా

వైఎస్సార్ చేయూతపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ప్రసాదరావు

మందస: వైఎస్సార్ చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. గిరిజన ప్రాంతమైన బుడంబో, బుడంబోకాలనీ ప్రాంతాల్లో శనివారం చేయూత లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత నిధులతో కిరాణాషాపులు, పాడి ఆవులు తదితర యూనిట్లతో ఆదాయం పెంపొందించుకోవాలని కోరారు. చేయూత నిధులు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సాబకోట సర్పంచ్ సవర సంధ్య, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సవర కాంతమ్మ, సీసీ తేజ, వీవోఏలు నేతాజీ, ఖగేశ్ పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ



జవాన్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలి మండలం గూడెం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ పిట్ట రాము ఇటీవల మృతి చెందారు. దీంతో కుటుంబాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. జవాన్ కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయనతో పాటు సర్పంచ్ పి.సంతోషమ్మ, కార్యకర్తలు జి.వి.రెడ్డి మాస్టారు, టి.ఆదినారాయణరెడ్డి, పి.ఢిల్లేశ్వరరావు, పి.సుధాకర్, పి.సుందర్‌రావు, బి.శ్రీను, బుడ్డు, లోకనాథం ఉన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ



ప్లేట్లు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అమలవుతున్న సత్యసాయి నిత్యాన్నపూర్ణ కార్యక్రమానికి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎరుకోల జనార్దనరావు తనవంతు సాయంగా 50 భోజనం పేట్లను వితరణగా శనివారం అందజేశారు. రోగులు, వారి సహాయకుల కోసం నిత్యం భోజనాలు అందజేస్తున్న సత్యసాయి నిత్యాన్నపూర్ణ కార్యక్రమానికి తనవంతు సాయంగా వీటిని సమకూర్చినట్టు దాత పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆర్.రామచంద్రరావు, జి.వి.రెడ్డి మాస్టారు, బి.అయ్యబాబు, సేవా సమితి ప్రతినిధులు ఎస్.జగదీశ్వరరావు, బి.అన్నపూర్ణమ్మ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో అన్యాయం



మాట్లాడుతున్న మోహనరావు

మందస: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతు, కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని, పెరుగుతున్న ధరలను అదుపు చేయాలన్నారు. ఆహార భద్రతాచట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, పి.దేవేంద్ర, కె.కేశవరావు, ఎం.ధర్మారావు, ఎస్.వల్లభరావు, పి.అప్పలస్వామి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు



స్టాప్ బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను శనివారం పోలీసులు తొలగించారు. బెల్లుపడ–ఈదుపురం కూడలిలో వద్ద స్టాప్‌బోర్డులను సరిచేశారు. పట్టణ ఎస్సై సత్యన్నారాయణ ఉన్నారు.

అభివృద్ధి పరుగులు

- నాడు శిలాఫలకాలతో సరిపెట్టిన టీడీపీ
- నేడు పనులు చేసి చూపించిన వైఎస్సార్‌సీపీ సర్కార్

ఇచ్ఛాపురం రూరల్: 'అభివృద్ధి కళ్లముందు కనిపించాలి..సంక్షేమం అర్హుల లోగిళ్లలోకే వెళ్లాలి' ఇదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం. అధికారం చేపట్టిన నాటి నుంచీ అంతే బాధ్యతగా పనిచేశారు. దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలకు ప్రాణం పోశారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలతో ముంగిళ్లలోకే సేవలు తీసుకువచ్చారు. పల్లెను సంతోషాల లోగిలిగా మార్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరిట హడావిడిగా శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఇచ్ఛాపురం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. రూ. ఒక కోటిన్నర మండల పరిషత్ నిధులు, జిల్లా పరిషత్ నుంచి కోటిన్నర రూపాయలతో గ్రామాభివృద్ధికి పెద్దపీట వేశారు. రూ.6 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో తారురోడ్లను నిర్మించారు.

అభివృద్ధి పరుగులు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని 21 పంచాయతీల్లో 16 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మూడు చోట్ల ఆస్పత్రుల నిర్మాణాలు, నాడు-నేడు పథకంలో భాగంగా సర్కారు బడులు కార్పొరేట్ హంగులతో సుందరంగా మారాయి. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, మత్స్యకార తీర ప్రాంతానికి తారు రోడ్ల నిర్మాణాలు జరిగాయి.



రూ.3.79 కోట్లతో డొంకూరు మత్స్యకార గ్రామానికి తారురోడ్డు



బెన్నుగానిపేట రహదారి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణమైన బెన్నుగానిపేట రోడ్డు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది బాలకృష్ణాపురం నుంచి బెన్నుగానిపేట వరకు ఏఐఐబీ నిధులు రూ.41.29 లక్షలతో 2019 ఫిబ్రవరి 18న స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం. పనులు మాత్రం జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కృషి మేరకు రూ.45 లక్షలతో ఆ ప్రాంతంలో అద్భుతమైన సిమెంట్ రోడ్డు నిర్మాణమైంది.



నీటిలో కొళిగాం వెళ్తున్న ప్రజలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి దశకు చేరుకున్న అరకబద్ర వంతెన

ఈ చిత్రంలో కనిపిస్తున్న శిలాఫలకం పాయితారి గ్రామం సమీపంలోనిది. అరకబద్ర–కొళిగాం గ్రామాల మధ్య పారుతున్న బాహుదానదిపై వంతెన నిర్మించడానికి 2018 నవంబర్ 28న రూ.1380.28 లక్షలతో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు సంయుక్తంగా వేసిన శిలాఫలకం. సుమారు పది గ్రామాల ప్రజల కలగా మారిన ఈ వంతెన పేరుతో ఓట్లు దండుకున్న నాయకులు అధికారంలోకి వచ్చాక, వంతెన పేరుతో వారిని వంచన చేశారే తప్పా అప్పటి నుంచి ఇప్పటి వరకు వంతెన నిర్మాణం పనులు గురించి పట్టించుకోలేదు. పిరియా సాయిరాజ్ కృషితో వంతెనకు రీ టెండర్‌తో రూ.1380.28 లక్షలతో వంతెన పనులు దాదాపు పూర్తి దశకు చేరుకుంది.

చేతల ప్రభుత్వం



ఎన్నికల ముందు మా గ్రామానికి రోడ్డు వేస్తామంటూ ఎమ్మెల్యే అశోక్ శిలాఫకం వేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే అయినప్పటికీ హామీ మర్చిపోయారు. అనంతరం అధికారంలో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కృషితో మంచి రోడ్డు వేసి మా కలను నిజం చేశారు.

– చినపాన ఖోగయ్య, బెన్నుగానిపేట, ఇచ్ఛాపురం మండలం

జగనన్న రుణం తీర్చుకోలేం



దశాబ్దాల కల నెరవేర్చిన సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది. అరకబద్ర వద్ద ఉన్న బాహుదానదిపై వంతెన నిర్మిస్తామంటూ టీడీపీ ప్రభుత్వం చాలా సార్లు హామీ ఇచ్చింది, ఎంపీ, ఎమ్మెల్యేలు బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకం వేశారు. ఎన్నికలు రావడంతో ఆ సంగతి మర్చిపోయారు. అనంతరం సాయిరాజ్ కృషితో పనులు మొదలయ్యాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తి దశకు చేరుకుంటున్నాయి.

– రంగాల కృష్ణారెడ్డి, అరకబద్ర గ్రామం, ఇచ్ఛాపురం మండలం

పీవీకి భారతరత్నపై హర్షం



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి.నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావుతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. పీవీ చేసిన ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతి కొత్త పుంతలు తొక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పీవీని గుర్తించలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



కోటబొమ్మాళి: కొత్తపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రాంపాత్రుని ముకుందరెడ్డి శనివారం మృతి చెందారు. ఈయన మూడేళ్లుగా బోన్ క్యాన్సర్‌తో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందారు. రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈయనకు పలువురు పార్టీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. భార్య సావిత్రి ప్రస్తుతం కొత్తపేట సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఈయన మృతిపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ముకుందరెడ్డి మృతదేహానికి పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, పార్టీ నాయకులు దుక్క రామకృష్ణ, సుంకరి జనార్దన, గెడ్డవలస నాగభూషణరావు తదితరులు నివాళులర్పించారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి 19వవార్డు సూదికొండలో పలువురికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను నాయకులు శనివారం అందజేశారు. కౌన్సిలర్ శిష్టు బృందావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి పాల్గొన్నారు.

మందసను దత్తత తీసుకుని ఏం చేశారు?

- లోకేష్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రశ్న



మాట్లాడుతున్న నాయకులు

మందస: తిత్లీ తుపాను సమయంలో మందసలో మకాం వేసిన నారా లోకేష్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. హరిపురంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2018వ సంవత్సరంలో సంభవించిన తిత్లీ తుపాను సమయంలో నష్టపోయిన మందస మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని లోకేష్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆరేళ్లలో ఎన్ని సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేశారో వివరించాలన్నారు. తిత్లీ పరిహారం చాలదని ప్రశ్నించిన ఉద్దానం వాసులపై సరిపడా నిధులు ఎక్కడ ఉన్నాయని అసహనం వ్యక్తం చేసిన లోకేష్‌కు ఉద్దాన ప్రాంతంలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. దత్తత తీసుకున్నానని చెప్పిన ఆయన ముఖం చాటేసి, ఎన్నికల ముందు ఉద్దానంలో అడుగు పెట్టడం అభ్యంతకరమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ హయాంలో ఉద్దానం సమస్యలు తీరుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డుమెంబరు బత్తిని లక్ష్మణ్, ఉద్దానం క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, పార్టీ నాయకులు దుబ్బ కృష్ణారావు, తిమ్మల జీవన్, రామారావు, కుప్పిలి లోకనాథం ఉన్నారు.

టీడీపీకి రాజకీయ భవిష్యత్ శూన్యం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ



వార్డు సభ్యుడు రాజేశ్వరరావు ఇంట్లో నాయకులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

టెక్కలి: రానున్న ఎన్నికలతో టీడీపీకి పూర్తిగా రాజకీయ భవిష్యత్ శూన్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలో వార్డు సభ్యులు, ముఖ్య నాయకుల ఇంటింటికీ వెళ్లి ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు కంచుకోట బద్దలవడం ఖాయమన్నారు. ఈ ఎన్నికలతో టీడీపీ భవిష్యత్ పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతుందని జోస్యం చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అంతా సమిష్టిగా పనిచేయాలని కోరారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, నాయకులు చింతాడ గణపతి, పి.హేమలత, పి.చంటి, టి.కిరణ్, కె.అజయ్, బి.ధనుంజయ్, బి.తులసి, ఎస్.రాజేశ్వరరావు, కె.తిరుమలరావు, వి.అశోక్, ఎన్.సోమేష్, డి.పోలయ్య, అనంతయ్య, రవికుమార్‌గాంధీ, వర్తక సంఘం అధ్యక్షుడు వి.గోవిందరాజు ఉన్నారు.

'ఆ చట్టాలను రద్దు చేయాలి'



ప్రచారం చేస్తున్న కిసాన్ సభ కార్యకర్తలు

పలాస: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అఖిల భారత కిసాన్ మహాసభ శ్రీకాకుళం జిల్లా కన్వీనరు మద్దిల రామారావు కోరారు. ఈ నెల 16వ తేదీన జరుగునున్న సార్వత్రిక గ్రామీణ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పలాస కాశీబుగ్గ పట్టణంలోని జగనన్న కాలనీలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేయాలని, ఇచ్ఛాపురం వరకు వంశధార నదీ జలాలను రైతాంగానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోతనపల్లి బాలరాజు, పి.సింహాచలం, ఎల్.వెంకటమోహన్, దుర్గాప్రసాద్, ఉపేంద్ర, సోమేష్, ఎం.దాసు, రవి, మార్పు కృష్ణారావు, భాస్కరరావు, సున్నాడ లోకనాథం పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- మామిడిపల్లిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అందుకు ఇటీవల నిర్వహించిన 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీలే ఉదాహరణ అన్నారు. మామిడిపల్లి గ్రామంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీలను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతీ యువకులకు చాలా ముఖ్యమని చెప్పారు. దేహదారుఢ్యానికి ఉపకరించడమే కాకుండా ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని కలిగిస్తాయన్నారు. ఓటమి మరో గెలుపునకు నాందిపలుకుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, వైస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయిక్రిష్ణ, మామిడి నర్సింహమూర్తి, బొడ్డపాడు సర్పంచి తామాడ మదన్, సైని దేశయ్య, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, ఉపసర్పంచ్ వంకల మురళి పాల్గొన్నారు. మొత్తం 16 జట్లు తలపడుతున్నాయి. తొలిమ్యాచ్‌లో బొడ్డపాడు జట్టుపై శ్రీకాకుళం విజయం సాధించింది. లీగ్ పద్ధతిలో పోటీలు జరుగుతున్నాయి.

బోరు నిర్మాణానికి భూమిపూజ



పూజ చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మరువాడ పంచాయతీ డి.మరువాడ గ్రామంలో బోరు నిర్మాణానికి సర్పంచ్ ధనలక్ష్మి శనివారం భూమి పూజ చేశారు. యువజన సంఘం నాయకుడు ఎస్.దాసరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని సీఐ టి.ఇమ్మాన్యుయేల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని స్వర్ణ భారతి డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్‌డే శనివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా సీఐని కళాశాల సిబ్బంది సత్కరించింది. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చాట్ల సుజాత, కళాశాల చైర్మన్ తులసీదాస్, ప్రిన్సిపాల్ సందీప్ ఉన్నారు.

సబ్‌కలెక్టర్ దృష్టికి హౌసింగ్ సమస్యలు

టెక్కలి: హౌసింగ్ సమస్యలను వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ దృష్టికి శనివారం తీసుకువెళ్లారు. అయోధ్యపురం, సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ ఎరకన్నపేట గ్రామాల్లో హౌసింగ్ సమస్యలను విన్నవించారు. నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, స్థానిక నాయకులు టి.కిరణ్, చిన్ని జోగారావు ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కంబారాయుడుపేటలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: గ్రామస్థాయిలోనే సుపరి పాలన అందించే సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తో సాధ్యమైందని అన్నారు. పల్లివూరు, కంబారాయుడుపేట గ్రామాల్లో రూ.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మామిడి భాస్కరరావు, వంక చిరంజీవి అధ్యక్షతన జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజలపై పడి దోచుకు తినే జన్మభూమి కమిటీల పాలన మనకు వద్దని, సంక్షేమానికి పెద్దపీట వేసే జగన్ పాలన కోరుకుందామని పిలుపునిచ్చారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రజల వద్దకే పాలన వచ్చిందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నిధులు జమ చేశామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ జెండాను భుజాన మోసి ఎన్నికలకు సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌కు ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పాడ ఉపేంద్ర, నాయకులు కొర్రాయి గోపి, దున్న బాలరాజు, కర్ని శ్రీను, చింత హేమారావు, ఎ.గోపి, ఎస్.వెంకన్న, టి.వరదరాజు డి.ఉమామహేశ్వరరావు, నర్తు లక్ష్మీనారాయణ, న్యాయవాది కె.దేవరాజు, మాజీ సర్పంచ్‌లు దున్న ధర్మారావు, గురుమూర్తి పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ



విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తల్లిదండ్రులు సత్యమమ్మ, సన్యాసిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం టెక్కలిలోని వివిధ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ చేతుల మీదుగా ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఉంటున్న సుమారు 1030 మందికి రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన విద్యా సంస్కరణలకు దేశ వ్యాప్తంగా మేధావులు, విభిన్న వర్గాల ప్రజలంతా నీరాజనాలు పడుతున్నారని గుర్తు చేశారు. దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. ప్రతీ పేద, సామాన్య వర్గాలకు చెందిన పిల్లలందరికీ చక్కటి విద్యను అందజేయడానికి చేపడుతున్న సంస్కరణలు చారిత్రాత్మకంగా నిలిచాయన్నారు. సర్పంచ్ జి.సుజాత, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, వైస్ ఎంపీపీ ఎం.కిశోర్, నాయకులు చింతాడ గణపతి, పి.హేమలత, పి.వైకుంఠరావు, బి.ధనుంజయ్, మదీన్, చిన్ని జోగారావు, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, విద్యార్థి సంఘం నాయకుడు టి.సూర్యం, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

టెక్కలి రూరల్: రావివలస గ్రామ సమీపంలోని స్టోన్ ప్లస్ క్వారీలో ఉన్న కొంతమంది వ్యక్తులు తనపై దాడి చేశారని భగవాన్‌పురం గ్రామానికి చెందిన నక్కల్ల జయరాం శనివారం ఫిర్యాదు చేసినట్టు టెక్కలి పోలీసులు తెలిపారు. క్వారీ సమీపంలో భగవాన్‌పురం గ్రామానికి సంబంధించిన తోటలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఆ తోటలకు నష్టపరిహారంగా కొంత మొత్తంలో డబ్బులను క్వారీ యాజమాన్యం జయరాంకు ఇస్తుంది. అయితే గత ఏడాది ఇవ్వకపోవడంతో వాటిని అడిగేందుకు వెళ్లగా తనపై దాడి జరిగిందని జయరాం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు.

108 అంబులెన్స్ పరిశీలన

కాశీబుగ్గ: పలాస మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌ను డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు శనివారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ రికార్డు, డ్యూటీ చార్ట్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాహన సిబ్బంది బి.తారకేశ్వరరావు, పి.సత్యం, వెంకట్రావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు, నారాయణరావు ఉన్నారు.

14న సామూహిక అక్షరాభ్యాసాలు

కాశీబుగ్గ: ఈ నెల 14వ తేదీన సామూహిక అక్షరాభ్యాసాలను పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న రామాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు షిర్డీసాయి బాబా ఆలయ మేనేజర్ సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే పలాస మండలం రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో కూడా అక్షరాభ్యాసాలు జరుగుతాయని నిర్వహకులు మల్లా రామేశ్వరం తెలిపారు.

ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం

వజ్రపుకొత్తూరు రూరల్: యువతకు, ఉపాధి వేతనదారులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు బమ్మిడి అనందరావు, సీఐటీయూ నాయకుడు ఎన్.మోహన్‌రావు అన్నారు. కిడిసింగిలో ఉపాధి వేతనదారులతో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, బైరాగి ఉన్నారు.